www.ijmer.in
INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal:VOLUME:9, ISSUE:12(5), December:2020

తెలంగాణ ఉద్యమం - కాళోజీ కవిత్వం

డా. రాపోలు శ్రీనివాస్
తెలుగు సహాయాచార్యులు, తారా ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), సంగారెడ్డి, తెలంగాణా రాష్ట్రం.
సెల్: 9848050694 Email: srinivas.rapolu**42**@gmail.com

వ్యాస సంగ్రహం

ఈ వ్యాసం తెలంగాణ తొలిదశ ఉద్యమ నేపథ్యం, 1969 ఉద్యమ పరిణామాలు మరియు ప్రముఖ ప్రజాకవి కాళోజీనారాయణరావు జీవితం, సాహిత్యం, ఆయన 'నా గొడవ' కవిత్వంలోని సామాజిక, రాజకీయ చైతన్యాన్ని సమగ్రంగా వివరిస్తుంది. నిజాం నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా కలం ఎత్తిన కాళోజీ, అన్యాయాలను మరియు దోపిడీలను నిలదీసిన తీరును ఈ వ్యాసంలో చర్చించడం జరిగింది. అలాగే మాతృభాషాభిమానం, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యత, సామాన్యుడే దేవుడని చాటిన కాళోజీ తత్వం మరియు తెలంగాణ ఉద్యమంలో ఆయన విశేష పాత్రను ఈ వ్యాసం స్పష్టం చేస్తుంది.

కీలక పదాలు: తెలంగాణ ఉద్యమం - కాళోజీ నారాయణరావు - నా గొడవ - ప్రజాకవి - నిరంకుశ ప్రతిఘటన.

ఉపోద్ఘాతం

ఖమ్మం జిల్లా పాల్వంచలో దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రధానమైన విద్యుత్ కేంద్రాన్ని 'కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్' అనే పేరుతో 1961లో స్థాపించారు. ప్రాజెక్టు పని నిమిత్తం అనేకమంది ఉన్నతాధికారులను కావాలని ఆంధ్ర ప్రాంతీయులను నియమించారు. ఎంతో అనుభవమున్న తెలంగాణ వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ప్రాంతీయ అభిమానం వల్ల ఆంధ్ర అధికారులు తమ ప్రాంతానికి చెందిన అనేక మందిని ఇక్కడికి పిలిపించి, పూర్తిగా ముల్కీ నిబంధనలు ఉల్లంఘించి ఉద్యోగాలు ఇచ్చారు. స్థానికంగా భూములు కోల్పోయిన వారికి కూడా ఉద్యోగాలివ్వలేదు. దినసరి కూలీ పనులకు కూడా ఆంధ్ర జిల్లాల నుంచి పిలిపించారు. దాదాపు 1200 ఉద్యోగాల్లో తెలంగాణ ప్రాంతంవారు 200లోపు మాత్రమే ఉన్నారు.

1968లో 'తెలంగాణ ప్రాంతీయ సమితి'ని స్థాపించారు. తెలంగాణ రక్షణలు అమలు జరపాలని కోరుతూ నిరాహార దీక్షలు, నిరసనలు జరిగాయి. ఉస్మానియా విద్యార్థి సంఘం తెలంగాణ రక్షణల అమలు కోసం నిజాం కాలేజీకి ఊరేగింపు తీయాలని నిర్ణయించింది. విద్యార్థి సంఘం జనవరి 15న రవీంద్రనాథ్ ఆమరణ నిరసన దీక్షకు సానుభూతిగా రాజధాని నగరాల్లో జరిపిన సమ్మె దిగ్విజయంగా సాగింది. ఉద్యమం ఉధృతరూపం దాల్చడంతో 1969, జనవరి 18, 19 తేదీల్లో కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం అన్ని రాజకీయ పక్షాల నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

అఖిలపక్ష ఒప్పందం ప్రకారం ముల్కీ నిబంధనలకు వ్యతిరేకంగా తెలంగాణలో నియమించిన ఉద్యోగులందరినీ వెంటనే తొలగించి వారి స్థానాల్లో స్థానికులను నియమించాలి. ఈ విధంగా ఉద్యోగాలు కోల్పోయిన ఆంధ్ర ప్రాంతం వారికి వారి ప్రాంతంలో ఉద్యోగావకాశాలు కల్పించాలి. ఆంధ్ర ప్రాంతానికి తరలించిన తెలంగాణ మిగులు నిధుల లెక్కలు తీసి ఆ నిధులను తెలంగాణ ప్రాంత అభివృద్ధి కోసం ఉపయోగించాలి. రాజధాని అయిన హైదరాబాద్‌లో విద్యావసతులను విస్తరింపజేయాలి. ఈ అఖిలపక్ష

నిర్ణయాలను అమలుపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం 1969, జనవరి 21న '36' నంబర్ గల ఒక జీవోను జారీచేసింది.

1969, మార్చి 11న 'ఉద్యోగులు, ఉపాధ్యాయుల కార్యాచరణ సమితి' ఏర్పడింది. 1969 మేలో ప్రత్యేక తెలంగాణ జూన్ 1 లోగా ఏర్పడకపోతే రక్తపాతం తప్పదని ఉద్యోగ సంఘం నాయకుడు కేఆర్ ఆమోస్ ప్రభుత్వాన్ని హెచ్చరించడంతో ప్రభుత్వం ఉద్యోగ సంఘాల గుర్తింపును రద్దు చేసింది. అంతేకాకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉద్యోగులను రెచ్చగొడుతున్నాడనే కారణంతో ఆమోస్ను గవర్నర్ ఉద్యోగం నుంచి 1969, మే 25న డిస్మిస్ చేశారు. 1969, జూన్ 10 నుంచి ఉద్యోగులు నిరవధిక సమ్మె నిర్వహించి 1969 జూలై 16 (37రోజులు)న విరమించారు. దీంతో తెలంగాణ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వానికి తగిన సలహాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అలహాబాద్ మాజీ ప్రధాన న్యాయమూర్తి నసీరుల్లాబేగ్ అధ్యక్షతన ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేసింది.

హైదరాబాద్లో మేధావులు 1969, జనవరి 13న 'కాటం లక్ష్మీనారాయణ' చైర్మన్గా 'తెలంగాణ పరిరక్షణల కమిటీ'ని ఏర్పాటు చేశారు. 1969, జనవరి 28న వరంగల్లో 'తెలంగాణ విమోచనోద్యమ సమితి' కాళోజీ అధ్యక్షతన ఏర్పడింది. 1969, జూన్లో హైదరాబాద్లో కాళోజీ నారాయణ రావు అధ్యక్షతన 'తెలంగాణ రచయితల సదస్సు' జరిగింది. 1969, మార్చి 25న హైదరాబాద్లో యువకులు, మేధావులు, విద్యార్థులు కొనసాగిస్తున్న తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా 'తెలంగాణ ప్రజాసమితి'ని స్థాపించారు. 1969 ఉద్యమాన్ని ప్రారంభించి తెలంగాణ రాష్ట్రం సాధించేదాక ఆపకూడదనే ఆలోచనతో కార్యాచరణ మొదలైంది. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో కాళోజీ భాగస్వామ్యం విశేషమైనదని చెప్పవచ్చు.

కాళోజీ నారాయణరావు

కాళోజీ నిత్యచైతన్యశీలి. కాళోజీ రాజకీయ కార్యకర్త, కవి, ఉద్యమకారుడు, పౌరహక్కుల నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, వ్యతిరేక ఫాసిస్ట్, తెంగాణ రాజకీయ కార్యకర్త, అన్నింటికీ మించి ఉత్తమ పౌరుడు. కాళోజీ అసలు పేరురఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాస రంగరాజ కాళోజీ. వీరు 9 సెప్టెంబర్ 1914 కర్ణాటక రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, రట్టహళ్ళి గ్రామంలో జన్మించారు. రమాబాయి, రంగారావు తల్లిదండ్రులు.వరంగల్ జిల్లా మడికొండలో ప్రాథమిక విద్య, వరంగల్, హైదరాబాద్లలో ఉన్నత విద్యను అభ్యసించారు. నిరంతరం ప్రజాసమస్యలపై.పోరాడిన ప్రజాకవి, నిత్యచైతన్యశీలి.నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పానకి వ్యతిరేకంగా ఆయన తన కలం ఎత్తాడు.గ్రంథాయోధ్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు.తెలంగాణలో ప్రతి గ్రామంలో గ్రంథాలయంఉండాన్నది కాళోజి ఆకాంక్ష.సత్యాగ్రహోద్యమంలో పాల్గొని 24 సంవత్సరా వయసులోనే జైలుశిక్ష అనుభవించాడు. నిజాం నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా కలం పట్టాడు.ఆయన మాటలు కత్తులుగ, కొడవళ్ళుగా, శూలాలుగా, పాటలు-ఈటెలుగా ఉంటాయి.ఆయన కవితా పంక్తులు సామెతలుగా, సూక్తులుగా, నానుడులుగా వాడుకునేంత సరళంగా ఉంటాయి. నిజాం వ్యతిరేక పోరాటాల నుంచి ఆధునిక పాలకుల దుర్మార్గాన్ని వ్యతిరేకించేదాక ఆయన జీవితం విస్తరించింది.

నా గొడవ, అణాకథలు, కాళోజీ కథలు, తుది విజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు, బాపూ! బాపూ!! బాపూ!!!, మొత్తం 3000 కవితలు ఇంగ్లీషు, మరాఠీ, తెలుగు భాషలలో రచించారు. ఖలీల్ జిబ్రాన్ రచనను 'జీవనగీత' గా అనువదించాడు. "నా గురించి చెప్పు కోవాలంటే ఎక్కడ అన్యాయం జరిగినా ప్రతిఘటిస్తూ వచ్చిన, అన్ని ఉద్యమాల్లో ధైర్యంగా పాల్గొన్న, ఎక్కడ అక్రమం జరిగినా దాన్ని ధిక్కరిస్తూ గేయమో, కథో రాసిన. నా గేయాలలో తొంభై ఐదు శాతం ఉద్యమాలపై రాసినవే. అవన్నీ గేయ రూపంలో

ఉన్న స్టేటుమెంట్లే." అని పేర్కొన్న సిసలైన కవి కాళోజీ. పి.వి. నరసింహా రావు లాంటి ఎందరికో ఆయన సాహిత్యంలో, రాజకీయాల్లో మార్గదర్శనం చేశాడు. కాలోజీకి కాకతీయ విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా, భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డుతో సత్కరించింది. 'హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు' అంటూ "సామాన్యుడే నా దేవుడు" అని ప్రకటించిన కాళోజీ 2002 నవంబరు 13 న తుదిశ్వాస విడిచారు. మరణానంతరం ఆయన పార్థివ శరీరాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అందజేశారు.

కాళోజీ కవిత్వం - 'నా గొడవ'

కాళోజీ పేరు వినగానే మొదట గుర్తొచ్చేది 'నాగొడవ'. ''ఇది కవి గొడవగానె అనిపించినప్పటికీ చదివిన వారికి తమ గొడవగానే అర్థమౌతుంది'' అన్న శ్రీశ్రీ మాట నిజమేననిపిస్తుంది. కాళోజీ దాదాపు 3000 కవితలు రాశాడు. అవి పది సంపుటాలుగా వెలువడ్డాయి. వీటిలో పది అనువాద కవితలు కూడా ఉన్నాయి. ఖలీల్ జిబ్రాన్ 'ప్రాఫెట్'కు 1968లో కాళోజీ ''జీవనగీత'' పేరుతో చేసిన అనువాదం ఎంతో ప్రసిద్ధికెక్కింది. ఇంగ్లీషు, మరాఠీ కథానికలకు అనువాదాలు కూడా చేశాడు. రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజీ దిట్ట. 'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తి గడించాడు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం ఆయన గేయాల్లో కనపడతాయి.

నిజాం నిరంకుశ పాలనకు ప్రజలు విసిగి, బ్రతుకు చితికి ఎదురుతిరుగుతున్న రోజుల్లో కాళోజీ కవిగా 'నా గొడవ'ను ప్రకటించాడు. *"నేనంటే, నువ్వు, నేను, వాడూ, / నా గొడవ మనస్థితి వైనం. / నేనంటే భారత పౌరుడు / నా గొడవ ఆ పౌరుని మనఃస్థితి, నేనంటే ఒక ఓటరు. / నా గొడవ ఓటరు మనఃస్థితి, / నేనంటే ఒక తిరుగుబాటు దారు, / నా గొడవ మన తిరుగుబాటు""అక్షర రూపం దాల్చిన - ఒకే ఒక్క సిరాచుక్క - లక్ష మెదళ్ళకు కదలిక - అన్నాడు బైరన్"*అని కాళోజీ భావన.

కాళోజీ ఒక ప్రాంతంవారు మరో ప్రాంతంపై చేసే పెత్తనాన్ని వ్యతిరేకించాడు. దోపిడి ఎవరు చేసినా దాన్నివ్యతిరేకించాడు. *"దోపిడి చేసే ప్రాంతేతరులను / దూరందాకా తన్ని తరుముతం*

ప్రాంతం వాడే దోపిడి చేస్తే / ప్రాణంతోనే పాతర వేస్తం"

నిజాం పాలనలో ముస్లిం మతోన్మాదులు, రజాకార్లు యథేచ్ఛగా ఆనాటి హైదరాబాద్ స్టేట్ లోని ప్రజల నుంచి చందాల పేరుతో డబ్బులు వసూలు చేసి, ఇవ్వని గ్రామాలపై దాడులకు పాల్పడి, దోచి తగులపెట్టి కసి తీర్చుకునేవాళ్ళు. బైరాన్‌పల్లి మారణహోమంపై ప్రజాకవి కాళోజీ స్పందన

"మన కొంపలార్చిన మన స్త్రీల చెరచిన / మనపిల్లల చంపి మనల బంధించిన

మానవాధములను మంలాధీశులను / మరచిపోకుండగ గురుతుంచుకోవాలె

కసి ఆరిపోకుండగ బుసకొట్టుచుండాలె / కాలంబురాగానె కాటేసి తీరాలె"

పరభాషాజ్ఞానాన్నిసంపాదించుకోవడం అవసరమే. కానీ, ఆసాకుతో అమ్మలాంటి మనభాషను నిర్లక్ష్యం చేయడం తప్పు. మన తేటతెలుగుభాషకు పూర్వవైభవం రావాలి అని పరితపించాడు కాళోజీ.

పరభాషలపై మోజుతో మాతృభాషను విస్మరించే వారిని కాళోజీ కంటే గొప్పగా హెచ్చరించిన వారెవరూ లేరు. అందుకే ఆయన జయంతి'తెలంగాణభాషాదినోత్సవం' అయింది.

"ఏభాషరానీదియేమివేషమురా? / ఈబాసఈవేసమెవరికోసమురా?

ఆంగ్లమందునమాటలాడగలుగగనే / ఇంతగాగులెక్కదవుఎందుకోసమురా?

తెలుగుబిడ్డడివయ్యుతెలుగురాదంచును/ సిగ్గులేకఇంకచెప్పుడెందుకురా?

అన్యభాషలునేర్చిఆంధ్రంబురాదంచు/ సకిలించుఆంధ్రుడా! చావవెందుకురా!"

తెలంగాణయాసనుగూర్చి, వాడుకభాషనుగురించికాళోజీఇలాచెబుతాడు.

"ఎవనివాడుకభాషవాడురాయాలె. ఇట్లురాస్తేఅవతలోనికితొస్తదాఅనిముందర్నే మనమనుకునుడు, మననుమనంతక్కువచేసుకున్న క్లై. ఈబానిసభావనపోవాలె. నేనెన్నో సార్లుచెప్పిన. భాషరెండుతీర్లు. ఒకటిబడిపలుకులభాష, రెండోదిపలుకుబడులభాష. పలుకుబడుభాషగావాలె",
"ఎవనికోనచ్చునట్లుపలకడంనాడు / ఎవనికివాడువచ్చినట్లుపలకడంఖాయంనేడు"

ప్రజాస్వామ్యం పరిఢవిల్లాంటే ఓటును సద్వినియోగం చేసుకోవాన్నాడు.

"ఓటిచ్చునప్పుడే ఉండాలె బుద్ధి - అనుచుంటి ఈ మాట అనుభవం కొద్ది"... అంటూ

'తస్మాత్ జాగ్రత ! జాగ్రత !' కవితలో ప్రజాస్వామ్యంలో నాయకులను ఎన్నుకునేటప్పుడు ఆలోచించమంటాడు...

"అభ్యర్థి ఏ పార్టీవాడనికాదు ఏపాటివాడో చూడు

ఎన్నుకుంటె వెలగబెట్టటంకాదు / ఇందాకా ఏం చేశాడోచూడు

ఇప్పుడు కట్టే ముడుపులు కాదు / ఇందాకా చెలించింది చూడు.

పెట్టుకునే టోపీకాదు పెట్టినటోపీచూడు / ఎగరేసిన జండాకాదు చాటున ఆడించిన దండా చూడు మనిషినిచూడు చరిత్రను చూడు / నుడువులుకాదు నడపడి చూడు.

కాళోజీకి కవిత్వమంటే అన్యాంపై అక్షరాయుధం. అందుకే ...

"అన్యాయాన్నెదిరిస్తే / నా గొడవకు సంతృప్తి /

అన్యాయం అంతరిస్తే / నా గొడవకు ముక్తి ప్రాప్తి /

అన్యాయాన్నెదిరించినోడు / నాకు ఆరాధ్యుడు... అని చాటాడు.

ధనిక, పేద వర్గాల మధ్య తారతమ్యమే కాదు, ఇతర విధాలా ఈ భిన్న ధృవాలుగా సమాజం విడిపోవడాన్ని 'వ్యత్యాసాలు' కవితలో ఎత్తిచూపుతారు.

"అన్నపురాశులు ఒకచోట /ఆకలి మంటలు ఒకచోట

హంస తూలికలొకచోట /అలసిన దేహాలొకచోట
సంపదలన్నీ ఒకచోట / గంపెడు బలగంబొక చోట
వాసన నూనియ లొక్కోట / మాసిన తలలింకొక చోట
అనుభవమంతా ఒక చోట / అధికారంబదియొకచోట..."

మనిషి స్వభావం గూర్చి, మంచి చెడు గూర్చి కాళోజీ ఇలా చెప్పాడు.

"మనిషి ఎంత మంచివాడు / చనిపోయినవాని చెడుని

వెనువెంటనె మరుస్తాడు / కాని మంచి తలుస్తాడు

మనిషి ఎంత చెడ్డవాడు / బ్రతికున్న వాని మంచి

గుర్తించడు కాని, వాని చెడుని / వెతికి మరీ గెలుకుతాడు"

నిజాం పాలనలోని అరాచకాలను వ్యతిరేకిస్తూ...

నవ యుగంబున నాజీవృత్తుల / నగ్న నృత్య మింకెన్నా ళ్లు ?

పోలీసు అండను దౌర్జన్యాలు / పోషణంబొందే దెన్నా ళ్లు ?

దమననీతితో దౌర్జన్యాలకు / దాగిలి మూతలు ఎన్నా ళ్లు ?

కంచెయె చేనును మేయుచుండగా / కాంచకుండు టింకెన్నా ళ్ళు?

దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకొని / దొరలై వెలిగే దెన్నా ళ్ళు ?

బాధలు పెట్టి పలుకనీయని / పాపులభయ మింకెన్నా ళ్ళు ?

హింసపాపమని యెంచుదేశమున / హిట్లరత్వ మింకెన్నా ళ్ళు ?

పగటి దోపిడుల నాపగలేని / ప్రభుత్వముండే దెన్నా ళ్ళు ?

'చాలింక' కవితలో ప్రజల అనుభవించే బాధల గూర్చి చెబుతాడు.

"బాధ్యతలేని ప్రభుత్వభటులు- పెట్టే బాధలు చాలింక

బాధ్యతగల పరిపాలనలేక - బ్రతికిన బ్రతుకులు చాలింక

హద్దుమీతి అధికారవర్గము - ఆడిన ఆటలు చాలింక

రాజు పేరట అరాజకమునకు - జరిగిన పూజలు చాలింక

రక్కసితనముకు పిశాచవృత్తికి - దొరికిన రక్షణ చాలింక

పాలన పేరట పల్లెపల్లెలో - జరిగేపాపము చాలింక

రక్షణకై ఏర్పడ్డబలగ మే - చేసే భక్షణ చాలింక

బీదల సర్వస్వముతో ధనికులు - చేసేబేరము చాలింక

విచ్చలవిడిగా ప్రాణమానముల - పాడినవేలము చాలింక

దొంగలంత దొరతనము పేరట - చేసినదోపిడి చాలింక"

'నేను బ్రతికేవుంటాను' ప్రజల తరపున పోరాటం చేయడానికి ఎల్లవేళల ఉంటానని ఇలా అంటాడు...

"నేను బ్రతికే వుంటాను / నా పరాయితనం పోగొట్టే ఆర్ద్రత

చెలిమి చెలిమెలో చిందుననన్నా ళ్లు / నేను బ్రతికే వుంటాను.

నా ఇరుకుల చేరిదూరి / అడ్డమైన మురికినంతా తన్నే సే జీవననది

జీవనదిగా ప్రవహించుచున్న న్నా ళ్లు / నేను బ్రతికే వుంటాను."

'కోటగోడలు నేల కూలుతున్నాయి' కవితలో అవినీతి, అన్యాయాలకు కాలం చెల్లిందని చెబుతాడు...

"అధికార మున్న దని హద్దుపద్దు లేక

అన్యాయ మార్గాల నార్జింప బూనిన

అచ్చివచ్చే రోజు లంత మైనాయి

ఆచ్చివచ్చే రోజు లంత మైనాయి.

కాజేయువారలను కక్షించువారల

కంట బడనీకుండ కాపాడుచుండిన

కోటగోడలు నేల కూలుతున్నా యి

కోటగోడలు నేల కూలుతున్నా యి."

'పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది' లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ గురించి కాళోజీ రాసిన ఈ పంక్తులు కాళోజీ జీవితానికి అక్షరాలా వర్తిస్తాయి. తెలంగాణ ఉద్యమంలో కాళోజీ కవిత్వం సకల జనులను ముందుకు నడిపించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రసాధనకు దోహదం చేసిందని చెప్పవచ్చు. కాళోజీ జీవితం కవిత్వం తెలంగాణ ప్రజలకు నిత్యస్ఫూర్తిగా నిలుస్తింది.

ఆధార గ్రంథాలు

1. లక్ష్మీనారాయణ, గంగిశెట్టి.(1974). నా గొడవ కాళోజీ ఏర్చికూర్చిన కవితల సంపుటి, యువభారతి ప్రచురణ, సికింద్రాబాద్-500 003.
2. కాళోజీ. (2017). నా గొడవ, కాళోజీ ఫౌండేషన్, హైద్రాబాద్.
3. మల్లారెడ్డి, తూర్పు. (1989). కాళోజి నారాయణరావు జీవితం-సాహిత్యం, శక్తి ప్రచురణలు, భువనగిరి.